విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 11, నవంబర్ 2024

కోయకుండానే కన్నీరు..!

- అధిక వర్షాలతో కేపీ ఉల్లికి తెగుళ్లు
- వెయ్యి ఎకరాల్లో నష్టం

విశాలాంధ్ర – చాగలమర్రి : ఆరుగాలం కష్టించి శ్రమించే రైతులు ఏదో రూపంలో నష్టపోతున్నారు. అతివృష్టి లేకపోతే అనావృష్టితో కన్నీరుకారుస్తున్నారు. చాగలమర్రి మండల పరిధిలో కేపీ ఉల్లి రైతుల దుస్థితి దయనీ యంగా మారింది. చింత చెరువు, కొలుములపేట, చిన్నవంగలి, ఆవులపల్లె తదితర గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు ఉల్లిని సాగు వేశారు. కేపీ ఉల్లి దిగుబడి బాగా వస్తే విదేశాలకు ఎగుమతులు చేయొచ్చునని రైతులు ఎంతగానో ఆశపడ్డారు. ఆకాల వర్షాలతో పాటు తెగుళ్ల బెడదతో కేపీ ఉల్లిరైతుల ఆశలు గల్లంతయ్యాయి. పంట దిగుబడి రావడం లేదని తీవ్ర ఆవేదనతో దాదాపు రెండొందల ఎకరాల్లోని పంటలను రైతులు దున్నేశారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టిన పెట్టుబడి వృథాయేనని కన్నీరుకారుస్తున్నారు. ఉల్లిని దున్నేసి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రెండెకరాల్లో వంట పొడైంది – నర్సిరెడ్డి, రైతు

చింతలచెరువు : రెండెకరాల్లో కేపీ ఉల్లిని సాగు చేశాను. రూ. వేలల్లో పెట్టిన పెట్టుబడి నష్టపోయాను. పంటకు వైరస్ సోకడంతో ఎండుముఖం పట్టింది. దిక్కుతోచక ట్రాక్టర్‌తో దున్నేశాను.

ప్రభుత్వం ఆదుకో వాలి – రామేశ్వరెడ్డి, రైతు, చింతల చెరువు : చింతల చెరువు గ్రామ పరిధిలో దాదాపు ఏడెకరాల్లో కేపీ ఉల్లిని సాగు చేశాను. మంచి దిగుబ డులు వచ్చి లాభాలు పొందొచ్చని భావిం చాను. ఎకరాకు దాదాపు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాను. వైరస్, తెగుళ్లతో పంటంతా నాశనమైంది. ప్రత్యామ్నాయ పంటలను సాగ చేసుకోవాలని దున్నేశాను. ప్రభుత్వం స్పందిం కనీసం పంట నష్టపరిహారం అందించాలి.

సచివాలయాల ముందు జరిగే ఆందోళన జయప్రదం చేయండి : సీపీఐ

విశాలాంధ్రబీ-బేతంచెర్ల : మండలంలోని ఇల్లులేని నిరుపేదలకు ఇంటి పట్టాలను ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో సిపిఐ కార్యాలయం నందు పట్టణ కార్యదర్శి పి.నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపుగా నాలుగు నెలలు కావస్తున్న ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని ఒక్క పింఛన్ మాత్రమే అమలు చేసి,మిగిలిన హామీలు అమలు చేయడం లేదన్నారు. హామీల అమలుకు ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించి ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్.యన్నా సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, డి.దస్తగిరి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, సిపిఐ పట్టణ శాఖ నాయకులు ఏలియా, కోదండరాముడు, రమణయ్య, మధురామయ్య, లక్ష్మయ్య, శివ, విధాత రామదాస్, ధనుంజయ,శంకర్ సుబ్బారావు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మధుకిరణ్, ఎల్లకృష్ణ, శ్రీకర్, దిలీప్, మధు, నంది విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్‌కు వైద్య సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర – డోన్ రూరల్: పెన్షనర్స్‌కు అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు హెల్త్ కార్డులతో కూడిన వైద్యం అన్ని వైద్యశాలల్లో వైద్య సౌకర్యం కల్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం భాను సింగ్ మాట్లాడుతూ డిశంబర్ 17వ తేది పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు. ఇన్కమ్ టాక్స్ చెల్లించే పెన్షనర్స్ ఈ నెల 20వ తేదీ లోపల ఎస్‌టిఓను కలిసి అప్లికేషన్‌ను సమర్పించాలని అన్నారు. ప్రభుత్వ వెంటనే పిఆర్‌సి, ఐఆర్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ పొందిన వారికి హెల్త్ కార్డులు అన్ని వైద్యశాలలో అమలు జరిగేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ గోపాల్, రామ సుబ్బారెడ్డి, సుబ్బారాయుడు, హుస్సేన్, గాలయ్య,మౌలాలి, పురుషోత్తం, వీరయ్య పాల్గొన్నారు.

ఆ.. సంఘానికి అండగా ఉంటాం : బీసీ ఇందిరమ్మ

విశాలాంధ్ర – బనగానపల్లె: కుమ్మరి శాలవాహన సంఘానికి అండగా ఉంటామని బీసీ ఇందిరమ్మ అన్నారు. బనగానపల్లె పట్టణం శివారు లోని నేలమట్టం నందు కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన 2024 పంచమ వార్షిక కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ కుమ్మరి శాలివాహనలకు ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు సురేష్, గౌరవ అధ్యక్షులు బాబయ్య, ప్రధాన కార్యదర్శి శివరాం, కోశాధికారి నాగరాజు, కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, రామసుబ్బయ్య, కర్నూల్ జిల్లా శాలివాహన అధ్యక్షుడు సోమేష్, కర్నూలు నగర అధ్యక్షుడు మధు, గుడుంబాటి శీను, కొణిదెల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వైఫల్యంతో స్పందన కరువు

విశాలాంధ్ర – చాగలమర్రి : అధికారుల వైఫల్యంతో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమానికి స్పందన కరువైంది. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలో 52 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు సమాచారం ఇవ్వడంలో సంబంధిత అధికారులు విఫలం అవ్వడంతో యువ ఓటర్లు ధరఖాస్తు చేసుకోవడానికి రాకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ ప్రధాన పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలు, పాత గ్రామ పంచాయితీలోని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత సిబ్బంది పోటోలు తీసుకొని పోలింగ్ కేంద్రాలకు తాళాలు వేసుకొని వెళ్ళిపోయారు. మండలంలోని పలు పోమరికొందరు 9న తీసుకున్న పోటోలు గ్రూపులో పెట్టి గైర్హాజర్ కావడం విశేషం. దీంతో పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యం ఏమేరా ఉందో అర్ధమవుతోంది. సంబంధిత పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే క్షేత్ర స్థాయిలో ఈవిధంగా జరుగుతోందని ఓటర్లు భావిస్తున్నారు.

ఆళ్లగడ్డలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలో ఆదివారం కీ.శే.షేక్ చాంద్ బాష రెండో వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వారి కుమారులు మస్తాన్ వలి, సద్దాం, బషీర్ లతో పాటు మరో 13 మంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి షేక్ చాంద్ బాష వర్ధంతి సందర్భంగా గర్భిణీలకు, తల సేమియా చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం ద్వారా సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ సెంటర్ నిర్వాహకులు ప్రవీణ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

విశాలాంధ్ర –మహానంది : మహానందీశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. కార్తీక మాసం వరుస సెలవు దినాలు కావడంతో భక్తులు వివిధ ప్రాంతాలనుండి అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. ముందుగా పుణ్య కోనేర్లలో స్నానాలు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ల ద్వారా శ్రీకాశమేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఏఈఓ మధు, ఆలయ ఉద్యోగులు పలు చర్యలు తీసుకున్నారు.

పార్టీ కోఆర్డినేటర్‌గా బరగొడ్ల హుస్సేన్ బాష

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజక వర్గం కాం గ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్‌గా బరగోడ్ల హుస్సేన్ బాషను ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల నియమించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 50 మందిని కాంగ్రెస్ పార్టీ సమ న్వయకర్తలుగా నియమిస్తూ జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ భాషా మాట్లాడుతూ ఎంతో బాధ్యతాయుతమైన పదవిని తమపై నమ్మకం ఉంచి తనను నియమించడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ బరగొడ్ల హుస్సేన్ బాషను నియమించడం పట్ల పలువురు హుస్సేన్ బాషకు శుభాకాంక్షలు తెలిపారు.

అటవీ అమర వీరులకు నివాళి

విశాలాంధ్ర – రుద్రవరం : విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన ఫారెస్ట్ అమర వీరులకు ఘన నివాళ్లు అర్పించారు. ఆదివారం రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఆధ్వర్యంలో స్థానిక అటవీక్షేత్రాధికారి కార్యాలయంలో ఫారెస్ట్ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన అటవీ అధికారులకు ఘనంగా నివాళులు అర్పించారు. డిప్యూటీ రేంజ్ అధికారి ముత్తు జావలి పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర – మిడుతూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలగనూరు రిజర్వాయర్‌కు ప్రతిపాదన చేసిన రూ.34 కోట్ల నిధులను రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానం చేసి అసెంబ్లీలో ప్రకటించి తక్షణమే నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, నంద్యాల సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడులు అన్నారు. ఆదివారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మిడుతూరు, గడివేముల మండలాల్లోని అన్ని గ్రామాల రైతులతో సంతకాల సేకరణ కార్యక్రమం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయకులు, సహాయ కార్యదర్శిఎస్ బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న ఆధ్వర్యంలో చేపట్టారు. మండల కేంద్రమైన మిడుతూరు బస్టాండ్ సెంటర్లో జరిగిన సభకు రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్ కట్ట తెగిపోయి దాదాపు నాలుగేళ్లు అవుతుందని, గత ప్రభుత్వా నిర్లక్ష్యానికి రైతులు నష్టపోయారన్నారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం రిజర్వాయర్ కట్ట నిర్మాణానికి రూ.34 కోట్లు మంజూరు చేయాలన్నారు. మిడుతూరు మండలంలోని అన్ని గ్రామాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. 10 గ్రామాలలో దాదాపు 50 వేల ఎకరాల మెట్ట భూమి ఉందని, రైతులు ఒకే పంటపైన ఆధారపడి జీవిస్తున్నారని, తక్షణమే మెట్ట రైతులు ఆదు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. రెండు రోజుల పాటు గడివేముల, మిడుతూరు మండ లాల్లో జీపు ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ రైతుల దగ్గరికి వెళ్లి సంతకాల సేకరణ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంతకాల సేకరణ అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొత్తపల్లె రైతు సంఘం మండల కార్యదర్శి వెంకట శివుడు, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు పిక్కిలి వెంకటేశ్వర్లు, దేవనూరు నాగ రాజు, జలకనూరు కురువ పెద్ద రాముడు, వెంకట స్వామి, అబ్రహం, బాష, కాటేపోగు సోమన్న, మాబాష, వీపనగండ్ల మద్దిలేటి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్: జిల్లాలో ఈ నెల 14న నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణం సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కోశాధికారి సురేష్‌లు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండవ మహాసభలను ఈనెల 14వ తేదీన నంద్యాల పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్ సర్కిల్ నుండి రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియం వరకు వేలాదిమంది విద్యార్థులతో ర్యాలీ చేపట్టిన అనంతరం బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. జిల్లా మహాసభలలో నంద్యాల జిల్లా విద్యారంగ అభివృద్ధిపై చర్చిస్తామని, అంతేకాకుండా నంద్యాల జిల్లా అయిన నేపథ్యంలో నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ టిటిసి, బీఈడీ కళాశాలలు,రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల్లో జిల్లా వ్యాప్తంగా వేలాదిగా విద్యార్థిని విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, అధ్యక్ష కార్యదర్శులు తరుణ్ సంతోష్, నంద్యాల పట్టణ సమితి నాయకులు హరి, సుధాకర్, వెంకటేష్, నరసింహ, రామ్ చరణ్, సద్దాం, మనోజ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల షాపులపై దాడులు ఆపాలి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : ఆళ్లగడ్డ పట్టణంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పద్ధతిలో మైనార్టీలకు చెందిన షాపులపై చిన్నచిన్న కారణాలు చూపి మున్సిపల్ అధికారులు అధికార పార్టీ అండ దండలతో దాడులు చేయడం సరైన పద్ధతి కాదని వెంటనే ఆపాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మైనార్టీలపై అనేక హామీలు గుప్పిస్తూ బిజెపితో అంటకాగిన గత ప్రభుత్వ వ్యతిరేకంతో మైనార్టీకి చెందిన ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బొమ్మతో గెలిచిన అధికార పార్టీ నాయకులు మైనార్టీలకు చెందిన షాపులపై దాడులు చేయడం దుర్మార్గమైన సిగ్గుమాలిన చర్య అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో 40 సంవత్సరాలుగా చికెన్ వ్యాపారం చేసుకుంటున్న ఏఎస్ఆర్ బ్రదర్స్‌కు చెందిన షాపును అధికార పార్టీ నాయకులు చికెన్ వ్యాపారం చేసే స్థాయికి దిగజారి, చిన్న, చిన్న కారణాలు చూపించి మున్సిపల్ అధికారులను ఉసిగొల్పి ట్రేడింగ్ లైసెన్స్ లేదని షాపును మూయించాలని కుట్ర చేయడం దారుణమని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి స్పందించి, ఉన్నత అధికారులు శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, మైనార్టీపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించి న్యాయం చేయాలని బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర – బనగానపల్లె: మండలం పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆలయ అభివృద్ధి కొరకు మదనపల్లి వాస్తవ్యులు శంకరపు భాస్కర్ వారి కుటుంబ సభ్యులు ఆలయ కార్యనిర్వాహణా ధికారి, అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి సమక్షం లో ఆలయ అర్చక, వేదపండితులకి రూ.25 వేల అందచేశారు. మదనపల్లి వాస్తవ్యులు బొమ్మిసెట్టి ఉదయకుమార్ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.25 వేల ఆలయ కార్యనిర్వహణాధి కారిణి జి.కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక,వేదపండితులకి అందచేశారు.

రాష్ట్ర అడవి అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర – ఆత్మకూర్ రూరల్ : బైర్లూటీ నందు గల అమరవీరుల స్థూపం వద్ద ఈరోజు రాష్ట్ర అడవి అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారికి అశ్రు నివాళి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ ఆత్మకూరు టైగర్ ఫారెస్ట్ వి.సాయి బాబా సమక్షంలో నాగులుటి క్షేత్రం దొరస్వామి, బైర్లుటి క్షేత్రం కృష్ణప్రసాద్, ఆత్మకూరు క్షేత్రం పట్టాభి, వెలుగోడు క్షేత్రం పిఎం ఖాన్, డివిజనల్ సిబ్బంది అసోసియేషన్ సభ్యులు కలిసి అడవి సంరక్షణ కొరకు ప్రాణాలు త్యాగం చేసిన అడవి సిబ్బందికి అశ్రునివాళి అర్పించారు.

బాలికల అభివృద్ధి కోసం పాటుపడింది మిషనరీలే

విశాలాంధ్ర – చాగలమర్రి : బాల బాలికలు అభివృద్ధి చెందాలంటే అందుకు ప్రధాన కారణం క్రైస్తవ మిషనరీలే అని రెవరెండ్ సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పాస్టరేట్ పరిధిలోని పెద్ద బోధనం, చిన్న భోదనం గ్రామాలలో బాలికల దినోత్సవం ఆ చర్చీలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాది కాలంలో నుండి బాలికలను చిన్న చూపు చూసేవారని, ఈ చిన్న చూపును పోగొట్టేందుకు క్రైస్తవ సంఘాలు క్రైస్తవ మిషనరీలు ఎంతో తోడ్పాటునందించాయన్నారు. బైబిల్‌లో కూడా బాలికలకు ప్రత్యేక స్థానం కలదన్నారు. బాలికల చదువు కోసం విలియం కేరి ఎంతో పోరాటం చేశారన్నారు. అనంతరం ప్రత్యేకంగా వారికోసం ప్రార్థన చేసి బహుమతులను అందజేశారు. చాగలమరి మండల పరిధిలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ఇరిగెల

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ: జనసేన పార్టీ తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆదివారం మచిలీపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత మందుల పంపిణీ

విశాలాంధ్ర – మహానంది: కార్తీక మాసం సందర్భంగా మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. తిమ్మాపురం వైద్యులు భగవాన్ దాస్ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పి సునీతా కుమారి, ఆశావర్కర్లు వెంకట లక్ష్మీ, కుమారిలు భక్తులకు మందులను అందజేశారు.

గురు రాఘవేంద్ర అధినేత దస్తగిరి రెడ్డికి అభినందన

విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్: గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ అధినేత దస్తగిరి రెడ్డి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ పురస్కారం అందుకున్న సందర్భంగా ఆత్మకూర్ పీఈటీ పుల్లయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో వేలమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ ఇటు విద్యారంగం, అటు క్రీడారంగం, వైద్యరంగంలోనూ జిల్లా ప్రజల్లో గుండెల్లో నిలువెత్తుని నిదర్శనంగా నిలిచిందన్నారు. ఇలాంటి రికార్డ్స్ మరెన్నో రావాలని ఆకాంక్షిస్తూ గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతో ఎల్లవేళలో చైర్మన్ దస్తగిరి రెడ్డికి నిరంతరం ఉండాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విశాలాంధ్ర – రుద్రవరం: మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ (64) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ తిరుమలేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యం మీద పడడంతో ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తి చెంది కల్లాపు నీటిలో కలిపే సౌభాగ్యం పొడి కలుపుకొని తాగిందన్నారు. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది అన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బెల్లం వూట ధ్వంసం..

విశాలాంధ్ర –అవుకు: మండలంలోని కొండమనాయునిపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లోని నాటు సారా భట్టీలపై బనగానపల్లి ఎక్సైజ్ సీఐ వర్ధనాదీవి ఆధ్వర్యంలో ఆదివారం దాడులు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు కొండమనాయునిపల్లి గ్రామంలోని నాలుగు నాటు సారా బట్టీలపై దాడులు చేసి 2500 లీటర్ల బెల్లం వూట ధ్వంసం చేసినట్లు తెలిపారు. బనగానపల్లి ఎక్సైజ్ ఎస్సై కమలాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ: మండలంలోని 77 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలో 298 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఫారం–6కు 124, ఫారం–7కు 21, ఫారం–8కి 39 కలిసి మొత్తం 184 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

జీవనోపాధికి జనుల తిప్పలు

- పెరిగిన మహిళా రైతు కూలీల కష్టాలు
- రోజువారి పని కోసం పక్క జిల్లాలకు పరుగు
- భూములు అమ్ముకోవడంతోనే గ్రామాల్లో కరువైన పనులు..

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల: తరాలుగా జీవనాధారంగా ఉన్న పచ్చని సాగు పంట పొలాలను రైతులు కార్పొరేట్ రంగాలకు తెగనమ్ముకోవడంతో గ్రామాలలో కష్టాలు మొదలయ్యాయి. భూములు కోల్పోయిన రైతులు, రైతు కూలీలు, మహిళలు గ్రామాలలో పనులు లేక ఇతర జిల్లాలకు పరుగు పెడుతున్నారు. గ్రామాలలో పంటల సాగు కనుమరుగు కావడంతో ఉపాధి కరువై పొట్టకూటి కోసం పడరాని కష్టాలు పడుతున్నారు. పచ్చని పొలాలు పడి వంటలతో కళకళలాడిన నాటి గ్రామాలు నేడు రైతంగమే లేకపోవడంతో వెలవెల బోతున్నాయి. ఉన్న భూములలో పంటలు సాగు చేసుకుంటూ ఎవరి వద్ద తలవంచని చిన్న, సన్న, మధ్యతరగతి రైతులు నేడు కూలీలుగా మరి రోజువారి పనుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతు కుటుంబాల లోని మహిళలు స్వంత భూములలో పనులు చేసుకుంటూ నాడు గౌరవప్రదంగా బతికిన మహిళా కూలీలు, నేడు పనుల కోసం పక్క జిల్లాలు, మండలాలకు ఆటోల్లో వెళుతూ అష్ట కష్టాలు పడుతున్నారు. మహిళ రైతు కూలీలకు పని చూపెట్టిన రైతు కుటుంబాలు నేడు పనుల కోసం వేచి చూస్తున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్ర లేచి రోజువారి పని కోసం వెళ్తున్నారు. సిమెంటు పరిశ్రమల రాకతో రైతులు, మహిళ కూలీల కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. మండలంలో 33 గ్రామాలు ఉండగా 16 గ్రామాలు పూర్తిగా సిమెంట్ పరిశ్రమల యజమాన్యం ఆధీనంలో ఉన్నాయి. ఆ గ్రామాల్లోని పచ్చని సాగు పంట పొలాలను రైతుల నుండి సిమెంట్ పరిశ్రమ యజమానియాలో కొనుగోలు చేసి వారి కుటుంబాలకు ఉపాధి లేకుండా చేశాయి. దీంతో ఆయా గ్రామాలలో రైతంగము కనుమరుగు కావడంతో వ్యవసాయ పనుల మీద ఆధారపడ్డ మహిళా రైతు కూలీలు ఆధారం కోల్పోయారు. దీంతో జీవనోపాధి కోసం ప్రతిరోజు 16 గ్రామాలలోని వందలాదిమహిళా రైతు కూలీలు ఆటోలలో అనంతపురం జిల్లా యాడికి,తాడపత్రి, కడప జిల్లా మైలవరం, పెద్దముడియం, సొంత జిల్లాలోని సంజామల తదితర మండలాలకు వెళు తున్నారు. భూములు తీసుకున్న సిమెంట్ పరిశ్రమలు పట్టించుకోకపోవడం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో ఉపాధి పనులు చేపట్టకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. వేలాది ఎకరాల సాగు భూములు కోల్పోవడంతో రైతన్నలు, కూలీలు శాశ్వతంగా గ్రామాలను పొదిలి వెళ్లి ఎందుకు సిద్ధమవుతున్నరు.

సేవలకు అత్యుత్తమ పురస్కారం అందుకున్న దస్తగిరి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి అత్యుత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. తాను చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డును ప్రధానం చేశారు. బ్యాంకింగ్ రంగంలో విశిష్ట సేవలు అందించి తన ఉద్యోగానికి రాజీనామా చేసి, తనలాగే ఎంతో మంది విద్యార్థులను బ్యాంకింగ్ రంగంలో చూడాలన్న లక్ష్యంతో శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్‌ను స్థాపించి సుమారు 42,500 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. తాను పుట్టిన సంజామల మండలం మంగపల్లి గ్రామంలో పేద ప్రజల కోసం తన తండ్రి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం తన తండ్రి అందించిన 10 ఎకరాల స్థలంలో ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రిని స్థాపించి స్థానిక ప్రజల కోసం ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారు. తన సొంత ఖర్చులతో రోగుల కోసం ఉచితంగా అంబులెన్స్‌ను నిర్వహిస్తున్న మహోన్నతుడు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఈ సందర్భంగా ఎన్జీవో కాలనీ శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక బృందావనం ఆడిటోరియంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డును అందించారు. ఈ సందర్భంగా అతిథి డాక్టర్ వసుధా రాణి మాట్లాడుతూ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారని, తాను అందించిన సేవలకు గుర్తుగా విశిష్టమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డును అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 11, నవంబర్ 2024

పక్కీరప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర – ఆస్పరి: మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో ఎండే పక్కిరప్ప ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఎండే పక్కిరప్ప కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలు, ఏమేరకు నష్టం వాటిల్లిందన్న అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనంతరం కామ్రేడ్ స్వర్గీయ బండమీద వెంకటేశ్వర్లు సేవాసమితి వారి ఆర్థిక సహాయంతో రూ.5 వేలు చెక్కు, ఆహార వస్తువులు, క్వింటం బియ్యంను బి.గిడ్డయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఎండే పక్కిరప్ప ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై జరిగిన ప్రమాదంలో 30 క్వింటాలు పత్తి, 2 క్వింటాలు మిరప, తిండిగింజలు, ఇంట్లో ఉన్న టీవీ, బీరువా, 20 వేల నగదు అగ్ని ప్రమాదంలో కాలిపోయి తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. దీంతో సుమారు రూ. 4 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాల ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, గ్రామ శాఖ కార్యదర్శి వీరేష్, ఉప సర్పంచ్ వెంకటేష్, స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు పెద్ద ఈరన్న అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి.రామ చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పూనుకుంటు న్నాయని విమర్శించారు. దేశానికి అన్నం, వస్త్రాలను అందించే అన్నదాత రైతుల ఆత్మహత్యలను నివారించాలన్నారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల రూపాయలు తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రబీ సీజన్లో పంటలు సాగు చేసుకునేందుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేద్దాం అన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు పెద్ద ఈరన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, నియోజకవర్గ కార్యదర్శి ఉమాపతి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: ఏపీ రైతు సంఘం నియోజకవర్గ నూతన కమిటీని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్ ప్రకటించారు. నియోజకవర్గ అధ్యక్షులుగా ఉమాపతి, ఉపాధ్యక్షులుగా రామనాయుడు, నాగిరెడ్డి, పెద్ద ముని, ప్రధాన కార్యదర్శిగా బి.సురేంద్ర కుమార్, సహాయ కార్యదర్శులుగా సిద్ధ లింగప్ప, కాశీ విశ్వనాథ్, హనుమన్న, గౌరవ అధ్యక్షులుగా కారన్న, కోశాధికారిగా మద్దిలేటి ఎంపికైనట్లు తెలిపారు.

ఎంపీని కలిసిన కురువ కార్పొరేషన్ ఛైర్మన్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కురువ కార్పోరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన మాన్వి దేవేంద్రప్ప కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుని మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసిన దేవేంద్రప్ప శాలువ కప్పి సత్కరించారు. తనకు కార్పోరేషన్ చైర్మన్ పదవి రావడానికి సహకరించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలూరు నియోజకవర్గ ఇంఛార్జ్‌గా లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర – చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్‌గా చిప్పగిరి లక్ష్మీనారాయణను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గం పార్టీ ఇన్చార్జిగా నియమితులైన చిప్పగిరి లక్ష్మీనారాయణ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్లు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ బలోపేతం కోసం కృషి చేసినందుకు పార్టీ అధిష్టానం గుర్తించిందన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పూర్తి స్థాయిలో నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని, ప్రధాన ప్రతిపక్షం పాత్ర పోషిస్తామన్నారు.

132 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - ఆస్పరి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జొహరాపురం గ్రామంలో బొలారో, టాటాయిస్ వాహనాలలో బియ్యం బస్తాలను లోడ్ చేస్తుండగా 132 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. జొహరాపురం కేంద్రంగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా వాహనాలలో తరలిస్తున్నారని గ్రామస్థుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడులు కొనసాగించారు. ఈ దాడులలో బొలెరో, టాటాయిస్ వాహనాలలో రేషన్ బియ్యం బస్తాలు లోడ్ చేస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వాటిని లెక్కించగా 50 కేజీలకు చెందిన 132 బస్తాల్లో 64 క్వింటాల రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధాంచారు. ఆకాష్, బాబు, కాశీపతి, రాములు, రాఘవరెడ్డి లు అక్రమ మార్గంలో బియ్యాన్ని తరలిస్తున్నారని తెలిపారు. మండలంలోని గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని జొహరాపురం గ్రామంలో డంపు చేసుకొని, వాహనాలలో లోడు చేసుకొని తరలిస్తున్నట్టు విజిలెన్స్ అధికారుల విచారణలో తేల్చారు. పట్టుబడ్డ రేషన్ బియ్యం వాహనాలను ఆస్పరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడులలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విశ్వనాథ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘీక కార్యక్రమాల అడ్డ.. చింత వనము

- కుప్పలుగా దర్శనమిస్తున్న సీసాలు, ప్యాకెట్లు
- బారులు తీరుతున్న మందుబాబులు
- నిత్యం పుట్టుకొస్తున్న గొలుసు దుకాణాలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, మహిళలు

విశాలాంధ్ర – కల్లూరు: పచ్చదనంతో హంద్రీ నది పక్కన వెలసిన భారీ చింత వనంలో మద్యం బాబులు మద్యం చేయిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మార్చిన పట్టించుకునే నాథుడే కరువయ్యారనె ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ సమీపంలో హంద్రీ నది ఒడ్డున భారీ చింత వనము ఉండడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యువత ప్రత్యేక వాహనాల్లో అక్కడికి చేరుకొని నిత్యం మద్యం సేవిస్తూ వనంను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మార్చుకున్నారు. ఎక్కడ చూసినా మద్యం ప్రియులు గుంపులు, గుంపులుగా కూర్చోని మద్యం సేవించినా మైకంలో సీసాలను పగలగొట్టి వెళ్తున్నారు. వనముకు దక్షణం వైపు రహదారి ఉత్తరం వైపు హంద్రీ నది ఉండడంతో మద్యం బాబులను ఆకర్షిస్తుంది. గతంలో ఈ వనములోకి సేద తీరేందుకు అనేకమంది కుటుంబ సమేతంగా వచ్చి హంద్రీ నదిలో జలకాలాడి వనములో సేదతీరి విశ్రాంతి తీసుకుని వెళ్లేవారు. కాలానుగుణంగా యువత మద్యానికి బానిసై గుంపులు గుంపులుగా చేరి చింత వనములో మద్యం సేవిస్తునడంతో తాగిన మైకంలో యువత అటువైపు వచ్చిన మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని వనంవైపు రావడం మానేశారు. మరోవక్క హంద్రి నదిపై తూర్పు నుండి పడమర దిశ వైపు బ్రిడ్జి అత్యంత పొడవుగా ఉండడంతో బ్రిడ్జి పైనుండి వెళ్లే వాహనదారులు ప్రయాణికుల సైతం చూపర్ లను కాసేపు నిలబడేలా దర్శనమిస్తుంది. అనేకమంది వాహనాలు నిలుపుకొని బ్రిడ్జి పైనుండి సెల్ఫీలు దిగుతూ పెట్టిన కొండ లాగా ఉన్న చాకిరేవు గుట్ట మరోవైపు కనుచూపు మేర కనిపించే హంద్రి నది చూపర్లను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇలా బస్తిపాడు గ్రామం మీదుగా నిత్యం అనేకమంది వాహనదారులు ప్రయాణాలు చేస్తూ ఆకర్షితులవుతున్నారు. ఇలా సేద తీరేందుకు వచ్చిన యువతకు గ్రామంలోనే మద్యం గొలుసు దుకాణాల ద్వారా వారికి అందుబాటులో మద్యం సీసాలు వాటర్ ప్యాకెట్లు గ్లాసులు సారా ప్యాకెట్లు తినుబండార వస్తువులు దొరుకుతున్నడంతో మద్యం ప్రియులు ఎక్కువ శాతం బస్తిపాడు గ్రామ సమీపంలోనికి వచ్చి మద్యం సేవిస్తూ కాలక్షేపం చేస్తూ వెళ్తున్నారు. మద్యం ప్రియులు గుంపులు గుంపులుగా చేరి అసాంఘి కార్యక్రమాలకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు మాత్రం మామూలకు అలవాటు పడి తమకేమీ పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని, యువత సంఖ్య రోజురోజుకు పెరిగిపోయి సాధారణ ప్రజలు వనంలోకి వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితిలో దాపురించాయి. అటువైపుగా పొలాలకు వెళ్లే రహదారి ఉండడంతో రైతులు ఒక్కొక్కరు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. తాగిన మైకంలో యువత అనేక మంది ఘర్షణలకు పాల్పడి, ఇష్టానుసారంగా గొడవలు పడుతూ బూతులు తిట్టుకుంటూ వల్గర్‌గా బట్టలిప్పుకుని తిరుగుతుండడంతో పక్కనే ఉన్న దోపిగాడులో కనీసం బట్టలు ఉతికేందుకు రజక కుటుంబీకులు ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. ఘాటు చుట్టూ పగిలిన సీసాలు పగిలిన అవశేషాలు ప్యాకెట్లు క్లాసులు నిత్యం తీసివేయలేక ఇబ్బందులకు గురవుతూ, సంబంధిత అధికారులకు ప్రజలు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదనె విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం బాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హత్య కేసులో నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర -చిప్పగిరి : చిప్పగిరి గ్రామానికి చెందిన కురువ కారుమంచప్పను హత్యచేసిన నిందితులను అరెస్టు చేయడం జరిగిందని పత్తికొండ డిఎస్‌పి వెంకట రామయ్య తెలిపారు. ఆదివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్ నందు పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదట్లో కురువ కారుమంచప్ప మృతిని అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆదివారం మృతుని కొడుకు కురువ శ్రీనివాసులు తన తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. తన తండ్రికున్న ఆస్తిని తోబుట్టువుల పేరిట రాసిస్తాడని తన తండ్రి అనడంతో హత్య చేసినట్లు బెల్దోణ గ్రామ రెవెన్యూ కార్యదర్శి ఎదుట లొంగిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శి శ్రీనివాసులును పోలీసుల ఎదుట హాజరుపరచడం జరిగిందని, అనంతరం నిందితున్ని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

మండలంలో ఓటర్ నమోదుకు స్పెషల్ క్యాంపులు

విశాలాంధ్ర – క్రిష్ణగిరి: మండలంలోఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రెండు రోజులు ఓటర్ నమోదుకు స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేశామని తహశీల్దార్ దేవచంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎరుకలచెరువు, క్రిష్ణగిరి పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియను కొనసాగించేందుకు ఎన్నికల కమిషనర్ ఆదేశించడం జరిగిందన్నారు. మండలంలో రెండు రోజులపాటు అన్ని గ్రామాల్లో బిఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నారన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డుతో వెళ్లి ఓటు నమోదు, సవరణ, తొలగింపు చేసుకోవాలని వీటికి సంబంధించి 6,7,8 ఫారాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల బిఎల్వోలు పాల్గొన్నారు.

ఈ నెల 18 ఇండ్ల స్థలాల కోసం ఆందోళన

విశాలాంధ్ర – కర్నూలు: పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో 18న చేపట్టిన ఆందోళనలు విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం సిపిఐ సదాశివ నగర్ శాఖ సమావేశం శాఖ కార్యదర్శి అన్వర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఈ నెల 18 తేదీన ఇండ్ల స్థలాల కొరకు జరిగే పోరాటంలో కలిసి రావాలని పేద ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలలో చంద్రబాబు నాయుడు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల స్థలము ఇస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీని పేద ప్రజలకు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో శాఖ సహాయ కార్యదర్శి పద్మ, శాఖ నాయకులు హుసేని, యాగంటి షాకీర బాష, రెహమాన్ మరియు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీ ఇవ్వండి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: నగరంలో ఎక్కడైనా కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే అర్జీ ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 10 నుండి నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉచిత ఇసుక హామీకే పరిమితం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఉచిత ఇసుక హామీ నియోజకవర్గంలో అమలు కావడం లేదని నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ అన్నారు. తక్షణమే ఉచిత ఇసుక విధానంపై శాసనసభ్యులు జయ నాగేశ్వర్ రెడ్డి స్పందించాలని కోరుతూ ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నందు భవన నిర్మాణ కార్మికులకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ గొంతుకు ఉరితాడు బిగించుకుని నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలేక నియోజవర్గంలో ప్రజలు ఇల్లు నిర్మాణాలను చేపట్టక పోవడంతో చేతికి పని లేక చాలామంది భవన నిర్మాణ కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం జరుగుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి సమావేశాలలో ప్రజలే స్వయంగా వెళ్ళి తమ వాహనాలతో ఇసుకను తీసుకువచ్చని పదే పదే చెప్పిన, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మాత్రం ఉచిత ఇసుక పాలసీ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమయుల్లా, భవన కార్మిక సంఘం నాయకులు నాగరాజు, నరసింహులు,సుంకన్న, రామాంజనేయులు, నరసప్ప, రవి, వీరేష్, జగన్నాథ్, హనుమంతు, శ్రీనివాసులు, వెంకటేష్, రంగస్వామి, మునుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర – సి.బెళగల్: 18 ఏళ్లు పూర్తి అయిన ప్రతి ఒక్కరూ ఓటర్గా నమోదు చేసుకోవాలని సి.బెళగల్ తహశీల్దార్ టి.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఎన్నికల క్యాంపెనింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూతులలో ఎన్నికల సిబ్బందికి తగిన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఆయన తనిఖీ నిర్వహించి బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయాలి : డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఆఫీస్ బేవర్స్ సమావేశం సీఆర్ భవన్ నందు ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సి.కుమార్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్, జిల్లా ఇన్చార్జి ఎస్.మునెప్ప, జిల్లా కార్యదర్శి సి.మహేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యంత దృఢమైందని, అలాంటి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి బిజెపి కుటిల ప్రభుత్వం చేస్తుందని అందులో భాగంగానే దేశ పార్లమెంటులో రాజదండం ప్రతిష్టించారని వారు విమర్శించారు. అనేకసార్లు రాజ్యాంగాన్ని సవరణ చేసి తనకు అనుకూలంగా పాలక ప్రభుత్వం మలుచుకుంటుందని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాస్వామ్య స్థానంలో రాచరిక వ్యవస్థకు పునాది వేయాలని చూస్తున్నారని, ఇది యావత్ దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారని, భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. ప్రభుత్వ రంగాలను ధ్వంసం చేస్తూ అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ కార్పొరేట్ కదంబ హస్తాలతో దేశాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. డిసెంబర్ 5వ తేదీ జరిగే దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ కుమార్ రాజా, రామచంద్ర, రామాంజనేయులు, సుందరయ్య, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల వద్ద ఇళ్ల స్థలాల కోసం ధర్నాలు

విశాలాంధ్ర–కోడుమూరు: గ్రామాలు, పట్టణాలలో నివసిస్తున్న ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు బి కృష్ణ, మండల కార్యదర్శి బి రాజులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం,సిపిఐ ఆధ్వర్యంలో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలకు కరపత్రాలు, అర్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్ల స్థలాలు లేక,స్థలాలు ఉన్నవారు ఇల్లు నిర్మించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్ల స్థలము, పట్టణాలలో ఉన్న పేదలకు రెండు సెంట్ల స్థలము, ఇళ్ల నిర్మాణం కొరకు రూ.4 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలో కొచ్చి 5నెలలు గడిచినా ఇళ్ల స్థలాల గురించి మాట్లాడడం లేదన్నారు. ఈ నెల 18న కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పెద్దఎత్తున పేదలను సమీకరించి వారిచే అర్జీలు ఇప్పించి, గ్రామ సచివాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.మాధవస్వామి, మునిస్వామి, బి.సుంకన్న, దాము, చిన్న రాముడు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పురుషుల షూటింగ్ బాల్ విజేత పల్నాడు జిల్లా

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: గత రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ విజేతగా పల్నాడు జిల్లా నిలిచింది. రెండో రోజు పోటీల ముగింపు కార్యక్రమానికి విజేతలకు బహుమతులు ప్రధానం చేయడానికి ముఖ్య అతిథులుగా కళ్ళ నాగ వేణి రెడ్డి హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగిన వారే అత్యున్నత స్థాయిలో రాణించగలరని, విద్యార్థి దశలోనే మన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడాకారులు తమకు నచ్చిన రంగంలో రాణించేలా కృషి చేయాలని చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్య మని క్రీడలను నిత్య సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ స్కూల్ కరస్పాండెంట్ ఏసుదాస్ క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు, పోటీల నిర్వాహకుడు నాగరాజ్, సభ్యులు కిరణ్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, మధు, సుభాన్ బాష, జిల్లా యోగా సంఘం కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

నాడు అక్కడ.. నేడు ఇక్కడ

- లాడ్జీలు, ప్రైవేట్ కేంద్రాల్లో స్థావరాలు ఏర్పాటుచేసి లక్షల ఆదాయం గడిస్తున్న నాయకులు
- పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగి నుండి పై స్థాయి అధికారి వరకు మామూల్లు ఇస్తుండడంతో మొద్దు నిద్ర
- పెద్ద తలకాయలను వదిలి పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం ప్రదర్శిస్తున్న పోలీస్ అధికారి
- లాడ్జిల్లో పేకాట ఆడుతున్న ప్రముఖ రాజకీయ నాయకులు,
- వ్యాపారస్తులకు పోలీస్ అధికారి అండదండలు
- కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్లుగా ఉంది ఓ పోలీసు అధికారి తీరు..

విశాలాంధ్ర-పత్తికొండ: రండి బాబు రండి, పేకాట ఆడేందుకు పత్తికొండకు అంటూ ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు పత్తికొండను కేంద్రంగా చేసుకొని లాడ్జిలలో ఆట ఆడేందుకు పిలుచు కుంటు =న్నారు. లాడ్జిల్లో, ప్రైవేట్ కేంద్రాల్లో పేకాట రాయుళ్లు పోటీపడి లక్షలలో ఆట కొనసాగిస్తున్నారు. పోలీసు అధికారి గద్దలను గాలికి వదిలి పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం ప్రదర్శిస్తూ దళితులను, బుడగజంగాలను టార్గెట్ చేసుకొని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వత్తికొండలో పేకాట ఆడేందుకు కర్నూలు, నంద్యాల, ఆదోని, అనంతపురం, గుత్తి, గుంతకల్, బళ్లారి తదితర ప్రాంతాల నుండి పేకాట రాయుళ్లు వచ్చి జూదమాడుతున్నారు. పెద్ద తలకాయలను వదిలేసి, మొక్కుబడిగా దాడులు చేసి పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం విధించడం ఏమిటని పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

చిరు మువ్వలు పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన చిరు మువ్వలు పుస్తకావిష్కరణ కార్యక్రమం విశ్రాంత అటవీశాఖ అధికారి ఎఎల్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చిన్న కుమారుడు చంద్ర మోహన్ రెడ్డి, శైలజారెడ్డి దంపతుల నూతన గృహ ప్రవేశం సందర్భంగా తెల్లాపూర్, హైదరాబాద్‌లో విశ్రాంత భూగర్భ గనుల శాఖ అధికారి డా.వి.డి. రాజగోపాల్, విశ్రాంత అటవీశాఖ అధికారి ఎఎల్ కృష్ణారెడ్డి విచ్చేసిన ప్రముఖుల ఆదివారం ఘనంగా జరిగింది. అనతి కాల వ్యవధిలో 58పుస్తకాలు వ్రాసి ముద్రించిన గద్వాల సోమన్నను ఘనంగా సన్మానించారు. ప్రముఖ కళారుడు, తెలుగు భాషోపాధ్యాయుడు డి. కేశవయ్య, కవులు కొప్పుల ప్రసాద్, జి.రాజేంద్రప్రసాద్, అరవా రవీంద్ర బాబు, అతిరథ మహారథులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి అన్నారు. రాష్ట్ర బాషో పాధ్యాయ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఎస్ఎల్టిఏ రాష్ట్ర కమిటీకి జరిగిన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఒక కళాశాలలో ఎన్నికల్లో అధ్యక్షులుగా అంకల్ కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా శివానంద రెడ్డి ఎన్నికల కావడం కర్నూలు జిల్లా నుండి రాష్ట్ర గౌరవ సలహాదారులుగా ఎం.బాలన్న, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్.మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శిగా పి.వెంకటరమణ తదితరులు ఎన్నిక కావడం ఎంతో సంతోషకర విషయం అన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జి.వెంకటేశ్వర్లు, సలీం బాష మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న డీఈవో పూల్ లో ఉన్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భాషా పండితులకు రివర్షను రద్దు పరచి వారి స్కూల్లో అసిస్టెంట్లు కొనసాగించాలని వారి డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు చేపట్టాలని వారు సూచించారు. రమణ హుస్సేన్ తహేర పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో టీడీపీ కార్యకర్తలు

విశాలాంధ్ర – ఆదోని రూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వార్డులలో పర్యటిస్తూ గడప, గడప సందర్శనలో భాగంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ ఆదేశాల మేరకు టిడిపి వార్డు ఇంచార్జిలు చంద్ర, నరసింహులు సైనికులుగా పనిచేస్తున్నారు. ఆదివారం పట్టణంలోని కిల్చినపేట ఐదవ వార్డు, శక్తి గుడి ఏరియా ప్రాంతాలలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదు వలన బాధితులకు కొండంత భరోసా నిస్తుందని ప్రజలను మోటివేషన్ చేయడం జరిగింది.

కార్తీక మాస వాల్మీకి వనభోజన మహోత్సవం: కార్తీక మాస మహోత్సవం పురస్కరించుకొని వాల్మీకి వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 24న పట్టణంలోని మహేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వాల్మీకి ముద్దుబిడ్డ టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసే అధి కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం వాల్మీకి కుల బంధువులతో కలిసి ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వాల్మీకి కులస్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో రాంబిం నాయుడు, టీచర్ లక్ష్మీకాంత, అమరావతి విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, జాలే బెంచ్ సర్పంచు గోవిందు, రెండవ వార్డ్ కౌన్సిలర్ సురేష్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 11, నవంబర్ 2024

శ్రీరాజేశ్వరి టెట్ విజేతలను అభినందించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన టెట్ ఫలితాలలో అత్యున్నత ర్యాంకులు సాధించిన శ్రీ రాజేశ్వరి కోచింగ్ సెంటర్, జోయా కోచింగ్ సెంటర్ లకు చెందిన అభ్యర్థులు టెట్, ఎస్‌జిటి 136 మార్కులతో నారాయణమ్మ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించగా, స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 134 మార్కులతో ఉమ్మడి కర్నూల్ జిల్లా ఫస్ట్ ర్యాంక్ పి.నిహా సాధించిందని తెలిపారు. వందశాతం టెట్ అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినందుకు వారికి అభినందన సభను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అభినందన సభకు ముఖ్యఅతిథిగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని, టెట్ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థినిలను అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గినప్పటికీ నంద్యాల ప్రాంతం అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించడం ఎంతో శుభ పరిణామన్నారు. గ్రామీణ ప్రాంత డీఎస్సీ అభ్యర్థులకు ముస్లిం మైనార్టీలకు టెట్టు ఉచిత కోచింగ్ జోయా ఉర్దూ కోచింగ్ సెంటర్, శ్రీ రాజేశ్వరి కోచింగ్ సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ర్యాకులు సాధించారని డీఎస్సీలో కూడా ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని ఫిరోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజేశ్వరి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ గంగాధర్, రమేష్, పీరా సాహెబ్, జిలాని, శ్రీకాంత్, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు మా సహకారాలు ఎప్పటికీ ఉంటాయి : బీసీ ఇందిర

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో ది రిటైల్ మండి మర్చంట్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం కార్యక్రమం జిల్లా వాణిజ్య విభాగ చైర్మన్ టంగుటూరి సీనయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరరెడ్డి, పెండేకంటి కిరణ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ది రిటైల్ మండి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా జీవీ కృష్ణ, కార్యదర్శిగా శ్రీరామ మోహన మురళి, కోశాధికారిగా ఇల్లూరి సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి వ్యాపారస్తునికి మా కుటుంబ సహాయ, సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని ఆమె కోరారు. అనంతరం మండి మర్చంట్ అసోసియేషన్ సభ్యులు బిసి ఇందిరా రెడ్డిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లగట్ల వెంకటేశ్వర్లు, గాదం శెట్టి వేణుగోపాల్, శ్రీరామ సుబ్రహ్మణ్యం, సాయిరాం, డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణయ్య, రాజేంద్ర, మారుతి షాప్ రవి, జనార్ధన్, శివయ్య, కేతవల్లి శివచంద్రయ్య, కాసుల జక్కం శెట్టి, పణి జక్క నాగరాజు, రాజేష్ ఆర్యవైశ్యులు, మల్లారెడ్డి, నాగేంద్ర, నాగరాజు, బాలనాయుడు, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రజక కార్పోరేషన్ చైర్మన్ సావిత్రిని కలిసిన రజకులు

విశాలాంధ్ర - హెరాళగుంద : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం నామినేటడ్ పదవులను విడుదల చేశారు. అందులో బిజెపి కోటాలో ఆదోనికి చెందిన అడ్వకేట్ సావిత్రి రాష్ట్ర రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవి కల్పిచడం పట్ల హెళగుంద మండలం రజకలు మర్యాద పూర్వకంగా కలిశారు. క్రియాశీలకంగా ఉంటు న్యాయవాది సావిత్రి అంచులు అంచలుగా ఎదుగుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ఉమ్మడి జిల్లా సెక్రటరీగా, ఉమ్మడి ఎలక్షన్ సెక్రటరీగా, రాష్ట్ర కోకన్వీనర్‌గా, పల్లేకు పోదాం కార్యక్రమం నిర్వహిం చారన్నారు. ఆమే సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం రాష్ట్ర రజక వెల్ఫర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి కల్పిచడంతో చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా హెరాళగుంద, ఆస్పరి రజకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఐటీయూ నాగ రాజు చిగిలి ఈరన్న, నేరణికి మడివళ నాగేంద్ర, శేఖర్, సున్నం వీరేష్, రాజా, క్రిష్ణ, మల్లి, రంగస్వామి, చిన్న సిద్ధప్ప రాజా, నేరణికి మలి కార్జున, ఈరన్న, ధన్‌రాజు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ నియోజకవర్గాల సమన్వయకర్తలు

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు : రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి రాష్ట్ర అసెంబ్లీ నియోజక వర్గాలకు సమన్వయ కర్తలను నియమించడం జరిగినది. అందులో భాగంగా కోడుమూరుకు మాజీ ఎమ్మెల్యే, కర్నూలు డిసిసి అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ, కర్నూలుకు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, ఎమ్మిగనూరుకు ఎం.ఖాశీం వలి, ఆదోనికి జి.రమేష్ యాదవ్, మంత్రాలయం పిఎస్ మురళీకృష్ణరాజు, ఆలూరుకు చిప్పగిరి లక్ష్మీనారాయణలను సమన్వయకర్తలుగా నియమించారు. పత్తికొండకు ప్రకటించాల్సి ఉంది.

చరవాణి వినోదంతో పాటు విజ్ఞానం అందిస్తుంది

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఆధునిక యుగంలో సెల్ ఫోన్ విజ్ఞానంతో పాటు వినోదం అందిస్తుందని, ఇదే సమయంలో కొంత మంది యువత పెడదారి పెట్టడానికి అవకాశం కల్పిస్తుందని ఎవటీజీ వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక టీజీవి కళాక్షేత్రంలు పత్తి ఓబులయ్య రచించిన సెల్లు పురాణం పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఈ పుస్తకాన్ని పమిడి వెంకటేశ్వర్లకు అంకితం ఇవ్వడం జరిగింది. సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ రచన అన్ని రంగాల్లో ఉండటం ఆధునికయుగంలో అవసరమన్నారు. మనిషి జీవితంలో అత్యవసర వస్తువుగా మారింది అన్నారు. రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి పుల్లయ్య మాట్లాడుతూ నేటి కాలంలో విద్యా రంగంలో ఎన్నో మార్పులు ఎన్నో చేర్పులు సెల్ ఫోన్ తెచ్చిందన్నారు యువత చేతిలో సెల్ ఒక అలంకారంగ మారిందన్నారు. రచయిత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ సమస్యలపై స్పందిస్తూ గతంలో కల్లోలం జీవన గీతం వంటి పుస్తకాలు సమాజానికి అందించి ప్రస్తుతం సెల్ఫోన్ కొంతమంది యువతను విద్యార్థులను పెడదారి పట్టిస్తుందని అందరికీ అర్థమయ్యే రీతిలో తేటగీతలో రచించడం జరిగింది. సామ్యూల్ మహమ్మద్ మియా, బాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, సెల్లు పురాణంలోని పద్యాలను చదివి వినిపించారు. కరిముల్లా బృందం సెల్ఫోన్‌లోని వివిధ యాప్లను, వాటి వివరాలను శ్రోతలకు వివరించారు. శివయ్య, లక్ష్మీ కాంతారావు, ఆంజనేయులు, డాక్టర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

హామీల అమలు జాప్యంపై కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - సి.బెళగల్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు జాప్యంపై సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు జే మోహన్ ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలు, గోడ పత్రికలు పంపిణి చేశారు. అనంతరం పాత బస్టాండ్‌లో ప్రజా సంఘాల నాయకులతో, కార్యకర్తలతో కలిసి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా, 18 ఏళ్ళు నిండిన వారికీ నెల, నెలా 1500, నిరుద్యోగ భృతి సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రచారాలతో ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమైయిందన్నారు. ఒట్టి మాటలతో కాలయాపన చేయడం కాదని డీస్సీ అంటూ తెర మీదకు తెచ్చి ఇప్పుడు ఆ ఉసెత్తక పోవడం ఏమిటన్నారు. ఈ నెల 14న సంగటితమవ్వాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

సీఎంను కలిసిన మోమిన్ షభాన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు, సోషల్ మీడియాలో పోస్టింగ్ లపై చర్యలు తీసుకోవాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షభానా శనివారం శ్రీశైలం లో విజయవాడ నుండి శ్రీశైలం వరకు సీ ప్లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించి శ్రీశైలం చేరుకున్న సందర్భంగా బిజెపి నాయకురాలు మోమిన్ షభానా రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్నా హత్యలు లైంగిక వేధింపులు గురించి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం సమర్పించారు.

సభ్యత్వంతో కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీల్లో లేనివిధంగా టిడిపిలో క్రియాశీలక కార్యకర్తలను ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఈ సందర్భంగా నంద్యాల 39వ వార్డు టిడిపి ఇంచార్జ్ జాకీర్ హుస్సేన్ ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గం టిడిపికి కంచు కోట అని, ప్రతీ ఒక్కరూ టిడిపి సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అఫ్సర్, ప్రసాద్, ఆది, రిజ్వాన్, హనీఫ్, బ్లడ్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయండి..

విశాలాంధ్ర - అవుకు: జనవరి 5వ తేదీన జరగనున్న హైందవ శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలని హైందవ శంఖారావ జిల్లా కన్వీనర్ కిషోర్ కుమార్ అన్నారు. అవుకు పట్టణంలోని గంగమ్మ ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి కిషోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ శంఖారావ బహిరంగ సభకు అన్ని గ్రామాల నుండి హైందవ సోదరులను తరలించి సభను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నిధి కన్వీనర్ మేడం సతీష్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ నాయక్, విశ్వహిందూ పరిషత్తు ప్రఖండ కన్వీనర్ మణికంత, దాసరి శ్రీనివాసులు, సద్దల మునిస్వామి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన హైందవ సోదరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణం గాంధీ చౌక్ నందు టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్‌కు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నిక చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రషీద్, సీనియర్ మైనార్టీ నాయకులు ఖాజా మౌలానా మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని పాటిస్తూ అదే విధంగా రాష్ట్రం నలుమూలల మైనార్టీల్లో వైసిపి ప్రభుత్వ సాగించిన రాక్షస పాలనను, అలాగే మైనార్టీల మీద జరిగిన అనేక దాడులను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ప్రజల్లో తీసుకెళ్తూ ప్రతినిత్యం ప్రజల్లోనే ఉంటూ టీడీపీశ్రీతీ అధికారంలో తెచ్చేవిధంగా తనవంతు కృషి చేశారన్నారు. తనను గుర్తించి పదవీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇస్మాయిల్ సత్తార్ అబ్దుల్ హమీద్, అబ్దుల్ రెహమాన్, మాబాష, సత్తారు సద్దాం, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల వద్ద ఇళ్ల స్థలాల కోసం ధర్నాలు

విశాలాంధ్ర-కోడుమూరు: గ్రామాలు, పట్టణాలలో నివసిస్తున్న ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు బి కృష్ణ, మండల కార్యదర్శి బి రాజులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం,సిపిఐ ఆధ్వర్యంలో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలకు కరపత్రాలు, అర్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్ల స్థలాలు లేక,స్థలాలు ఉన్నవారు ఇల్లు నిర్మించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్ల స్థలము, పట్టణాలలో ఉన్న పేదలకు రెండు సెంట్ల స్థలము, ఇళ్ల నిర్మాణం కొరకు రూ.4 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలో కొచ్చి 5నెలలు గడిచినా ఇళ్ల స్థలాల గురించి మాట్లాడడం లేదన్నారు. ఈ నెల 18న కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పెద్దఎత్తున పేదలను సమీకరించి వారిచే అర్జీలు ఇప్పించి, గ్రామ సచివాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.మాధవస్వామి, మునిస్వామి, బి.సుంకన్న, దాము, చిన్న రాముడు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పురుషుల షూటింగ్ బాల్ విజేత పల్నాడు జిల్లా

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: గత రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ విజేతగా పల్నాడు జిల్లా నిలిచింది. రెండో రోజు పోటీల ముగింపు కార్యక్రమానికి విజేతలకు బహుమతులు ప్రధానం చేయడానికి ముఖ్య అతిథులుగా కళ్ళ నాగ వేణి రెడ్డి హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగిన వారే అత్యున్నత స్థాయిలో రాణించగలరని, విద్యార్థి దశలోనే మన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడాకారులు తమకు నచ్చిన రంగంలో రాణించేలా కృషి చేయాలని చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్య మని క్రీడలను నిత్య సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ స్కూల్ కరస్పాండెంట్ ఏసుదాస్ క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు, పోటీల నిర్వాహకుడు నాగరాజ్, సభ్యులు కిరణ్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, మధు, సుభాన్ బాష, జిల్లా యోగా సంఘం కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: జిల్లాలో ఈ నెల 14న నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణం సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కోశాధికారి సురేష్‌లు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండవ మహాసభలను ఈనెల 14వ తేదీన నంద్యాల పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్ సర్కిల్ నుండి రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియం వరకు వేలాదిమంది విద్యార్థులతో ర్యాలీ చేపట్టిన అనంతరం బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. జిల్లా మహాసభలలో నంద్యాల జిల్లా విద్యారంగ అభివృద్ధిపై చర్చిస్తామని, అంతేకాకుండా నంద్యాల జిల్లా అయిన నేపథ్యంలో నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ టిటిసి, బీఈడీ కళాశాలలు,రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల్లో జిల్లా వ్యాప్తంగా వేలాదిగా విద్యార్థిని విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, అధ్యక్ష కార్యదర్శులు తరుణ్ సంతోష్, నంద్యాల పట్టణ సమితి నాయకులు హరి, సుధాకర్, వెంకటేష్, నరసింహ, రామ్ చరణ్, సద్దాం, మనోజ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల షాపులపై దాడులు ఆపాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆళ్లగడ్డ పట్టణంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పద్ధతిలో మైనార్టీలకు చెందిన షాపులపై చిన్నచిన్న కారణాలు చూపి మున్సిపల్ అధికారులు అధికార పార్టీ అండ దండలతో దాడులు చేయడం సరైన పద్ధతి కాదని వెంటనే ఆపాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాబాఫ కృద్దీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మైనార్టీలపై అనేక హామీలు గుప్పిస్తూ బిజెపితో అంటకాగిన గత ప్రభుత్వ వ్యతిరేకంతో మైనార్టీకి చెందిన ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బొమ్మతో గెలిచిన అధికార పార్టీ నాయకులు మైనార్టీలకు చెందిన షాపులపై దాడులు చేయడం దుర్మార్గమైన సిగ్గుమాలిన చర్య అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో 40 సంవత్సరాలుగా చికెన్ వ్యాపారం చేసుకుంటున్న ఏఎస్ఆర్ బ్రదర్స్‌కు చెందిన షాపును అధికార పార్టీ నాయకులు చికెన్ వ్యాపారం చేసే స్థాయికి దిగజారి, చిన్న, చిన్న కారణాలు చూపించి మున్సిపల్ అధికారులను ఉసిగొల్పి ట్రేడింగ్ లైసెన్స్ లేదని షాపును మూయించాలని కుట్ర చేయడం దారుణమని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి స్పందించి, ఉన్నత అధికారులు శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, మైనార్టీపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించి న్యాయం చేయాలని బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆలయ అభివృద్ధి కొరకు మదనపల్లి వాస్తవ్యులు శంకరపు భాస్కర్ వారి కుటుంబ సభ్యులు ఆలయ కార్యనిర్వాహణా ధికారి, అసిస్టెన్ కమిషనర్ కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి సమక్షం లో ఆలయ అర్చక, వేదపండితులకి రూ.25 వేల అందచేశారు. మదనపల్లి వాస్తవ్యులు బొమ్మిసెట్టి ఉదయకుమార్ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.25 వేల ఆలయ కార్యనిర్వహణాధి కారిణి జి.కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక,వేదపండితులకి అందచేశారు.

రాష్ట్ర అడవి అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర - ఆత్మకూర్ రూరల్ : బైర్లూటీ నందు గల అమరవీరుల స్తూపం వద్ద ఈరోజు రాష్ట్ర అడవి అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారికి అశ్రు నివాళి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ ఆత్మకూరు టైగర్ ఫారెస్ట్ వి.సాయి బాబా సమక్షంలో నాగులుటి క్షేత్రం దొరస్వామి, బైర్లుటి క్షేత్రం కృష్ణప్రసాద్, ఆత్మకూరు క్షేత్రం పట్టాభి, వెలుగోడు క్షేత్రం పిఎం ఖాన్, డివిజనల్ సిబ్బంది అసోసియేషన్ సభ్యులు కలిసి అడవి సంరక్షణ కొరకు ప్రాణాలు త్యాగం చేసిన అడవి సిబ్బందికి అశ్రునివాళి అర్పించారు.

పక్కీరప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర - ఆస్పరి: మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో ఎండే పక్కిరప్ప ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పో యిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఎండే పక్కిరప్ప కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలు, ఏమేరకు నష్టం వాటిల్లిందన్న అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనం తరం కామ్రేడ్ స్వర్గీయ బండమీద వెంకటేశ్వర్లు సేవాసమితి వారి ఆర్థిక సహాయంతో రూ.5 వేలు చెక్కు, ఆహార వస్తువులు, క్వింటం బియ్యంను బి.గిడ్డయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఎండే పక్కిరప్ప ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై జరిగిన ప్రమాదంలో 30 క్వింటాలు పత్తి, 2 క్వింటాలు మిరప, తిండిగింజలు, ఇంట్లో ఉన్న టీవీ, బీరువా, 20 వేల నగదు అగ్ని ప్రమాదంలో కాలిపోయి తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. దీంతో సుమారు రూ. 4 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, గ్రామ శాఖ కార్యదర్శి వీరేష్, ఉప సర్పంచ్ వెంకటేష్, స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనమహోత్సవం

విశాలాంధ్ర - హెరాళగుంద: ఆలూరు తాలూకా కమ్మ జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితులు సత్యనారాయణ స్వామి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. దంపతులు సత్యనారాయణ పూజలో ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాన్ని పొందారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సోదరుడు ఉమాపతి నాయుడు, వైకుంతం మల్లికార్జున మాట్లాడుతూ కమ్మ జన సంఘం సమాజానికి మేలు చేస్తుందని సామాజిక సేవ కార్యక్రమంలో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఆలూరు తాలూకా కమ్మజన సంఘం నాయకులు వైకుంతం మల్లికార్జున, మీనాక్షీ నాయుడు, మిక్కిలినేని రమేష్, కోనంకి గోపీనాథ్,జొహరాపురం ప్రకాష్, రాయల రాముప్ప, మిక్కిలినేనివెంకట శివప్రసాద్, మిక్కిలి నేని శ్రీనివాస్, కోడాలి వేణు గోపాలరావు, విజయ భాస్కరరావు, సజ్జా రామకృష్ణ, గోపి, మిక్కిలినేని కిరణ్ ఆలూరు తాలూకా కమ్మ జన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డ్రిప్పు పైపుల దగ్ధం..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని మదనంతపురం గ్రామంలో పొలంలోని డ్రిప్ పైపులు ప్రమాదవశాత్తు ఆదివారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కొట్టే కృష్ణారెడ్డి డ్రిప్ పైపులతో బోరు బావి కింద సాగు చేసిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట కోతకు రావడంతో ఇటీవల కంకులను మిషన్ ద్వారా కోత కోసి గింజలను పొలంలోనే ఆరబోశాడు. ఎండిన మొక్కలు ఉండడంతో ప్రమాదవశాత్తు అగ్నికి అంటుకోవడంతో భూమిపై పరిచిన డ్రిప్పు పైపులు కూడా కాలిపోయాయి. మంటలను గమనించిన కొందరు రైతులు మంటలను ఆర్పి వేయడంతో అప్పటికే రెండు ఎకరాల డిప్ పైపుల కాలిపోవడంతో సుమారు రు 70 వేల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాద ఘటనపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

శ్రీ మఠంలో కర్నాటక రాష్ట్ర మంత్రి

విశాలాంధ్ర - మంత్రాలయం : ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆదివారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రాం యాదగిరి జిల్లా షాపూర్‌కు చెందిన చిన్న పరిశ్రమల శాఖ మంత్రి శరణబసప్ప దర్శనపూర్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరు శ్రీ మఠం కారిడార్‌కు చేరుకోగానే శ్రీ మఠం అసిస్టెంట్ పీఆర్వో హెూన్నళ్ళి వ్యాసరాజ్ ఆచార్ ఘన స్వాగతం పలికారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ ను దర్శించుకొని విశేష మంగళ హారతులు చేపట్టారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పీఆర్వో ఐ.పి.నరసింహ మూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్ తదితరులు పాల్గొన్నారు.